ప్రజాశక్తి

బుధవారం 23 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పీలాకు మేయర్ లాంఛనమేనా!

- సమీకరణాలపై 'కూటమి'లో గందరగోళం
- 28న మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐదేళ్లపాటు మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ స్థానంలో ఉండాల్సిన వారిపై విశాఖలో ఈ నెల 19న అభిశంసన చేసి దించేసిన సంగతి తెలిసిందే. మేయర్ స్థానంలో నగరంలో బలమైన సామాజిక తరగతి యాదవ కులం నుంచి గొలగాని హరి వెంకటకుమారిని వైసిపి ప్రభుత్వం ఎంపిక చేయడం, నాలుగేళ్లలో ఆమెను 'కూటమి' పాలకులు అవిశ్వాసం పేరుతో దించేయడంపై అటు వైసిపి నుంచి ఇటు ఇతర వెనుకబడిన తరగతుల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలకు 'కూటమి' ప్రభుత్వం తెర దించుతుందా? ఈనెల 28న నగర మేయర్ ఎన్నిక కోసం జరిగే ప్రత్యేక సమావేశంలో సరికొత్త సంకేతాలను టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఇస్తారా? అన్న చర్చ ప్రధాన రాజకీయ పార్టీల్లో నడుస్తోంది. ఒక మేయర్, రెండు డిప్యూటీ మేయర్ సీట్లకు ఎంపిక జరగాల్సి ఉన్నా ఈనెల 28న మేయర్, ఒక డిప్యూటీ మేయర్‌కు 'కూటమి' కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు. 28న ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థలో జివిఎంసి ఇన్ఛార్జి కమిషనర్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఈ ఎన్నికను చేపట్టనున్నారు. ఈ మేరకు 22న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ విడుదల కావడంతో టిడిపి, జనసేన, బిజెపి (కూటమి) పార్టీల్లో సందడి మొదలైంది.

అసలేం జరుగుతోంది? సమీకరణాలు మారనున్నాయా?

టిడిపిలో అత్యధిక మంది పీలా శ్రీనివాసరావుకు మేయర్ పీఠం దక్కే అవకాశాలున్నాయని పూర్తి స్థాయిలో నమ్ముతున్నారు. గడచిన రెండు నెలలుగా పీలా చేయని ప్రయత్నం అంటూ లేదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. సొంత పార్టీ టిడిపికి చెందిన వారిని, జనసేన, బిజెపి, అటు వైసిపి నుంచి కొంతమంది కార్పొరేటర్లకు సొంత నిధులు రూ.లక్షల్లో ఖర్చుపెడుతూ మేయర్ స్థానం దక్కించుకోడానికి పడరాని పాట్లు పడ్డారనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే చిక్కంతా ఇక్కడే వచ్చింది. గత మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సామాజిక తరగతి నగరంలో ప్రాబల్యంగా ఉంది. ఆ సామాజిక తరగతి వారితోనే ఆ పీఠాన్ని భర్తీచేయాలన్న డిమాండ్ కూటమిలో లోపాయికారిగా వినిపిస్తోంది. మొల్లి హేమలత టిడిపి కార్పొరేటర్‌కు 28న జరిగే మేయర్ ఎన్నిక సందర్భంగా డిప్యూటీ మేయర్ స్థానం దక్కే అవకాశాలున్నాయన్నది కూటమి కార్పొరేటర్ల నుంచే వినిపిస్తున్న మాట. యాదవ సామాజిక తరగతికి చెందిన విద్యావంతురాలు కావడంతో ఈమె ఎంపిక లాంఛనమే. అయితే సీను తిరగబడితే... మహిళకే మేయర్ స్థానం ఇవ్వాలని టిడిపి అధిష్టానం భావిస్తే పరిస్థితి ఇప్పటివరకూ అనుకున్న 'పీలా'కు మేయర్ స్థానం లాంఛనమే? అన్నది సందిగ్ధమే కాగలదు. మరో డిప్యూటీ మేయర్ స్థానం కూడా అతి త్వరలోనే టిడిపి కార్పొరేటర్‌కే తప్ప జనసేన, బిజెపి నుంచి పెద్ద ఎత్తున ఈ పదవిని ఆశిస్తున్న వారున్నా టిడిపి అధిష్టానం వీరికిచ్చే పరిస్థితి ఉండదన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి నుంచి టిడిపి, జనసేనలోకి వచ్చిన వారూ బిగ్గరగానే తమ గళాన్ని వినిపిస్తున్నా వారెవరికీ ఈ సీట్ల దరిదాపుల్లోకి రానివ్వకూడదన్నది టిడిపి, జనసేన తమ తమ అధిష్టానాలకు ఇప్పటికే చెప్పాయి. దీంతో పనులు, కాంట్రాక్టులు దక్కించుకోడానికి, ఆస్తులు కాపాడుకోడానికి 'కూటమి'లోకెళ్లి ఆ పార్టీలను అంటకాగుతున్న వైసిపి కార్పొరేటర్ల పరిస్థితి

మిగతా 2లో..

అధిక సంతానానికి ప్రాధాన్యమివ్వాలి

పోషణ్ పఖ్వాడా ముగింపులో మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పోషణ్ పఖ్వాడా రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

జనాభా వృద్ధి సిద్ధాంతాన్ని, మేనేజ్‌మెంటు విధానాన్ని అర్థం చేసుకొని అధిక సంతానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక్కరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనాలని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. విశాఖపట్టణంలోని ఉడా చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం పోషణ్ పఖ్వాడా -2025 రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరూ మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమని, దానిలో భాగంగా ఇప్పటికే మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశాలకు గ్రాట్యుటీ, మట్టి ఖర్చుల విషయంలో సానుకూలంగా వ్యవహరించారని, వివిధ రకాల నిధులు మంజూరు చేశారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకొని క్షేత్రస్థాయి సిబ్బంది కష్టపడి పనిచేయాలని కోరారు. ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయంతో సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. అంగన్వాడీల ద్వారా క్రమం తప్పకుండా గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, పర్యవేక్షించాలని చెప్పారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా మొదటి 1000 రోజులు పిల్లల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, జపాన్ దేశంలో మాదిరిగా ఇక్కడి పిల్లలకు ఆరోగ్యకర అలవాట్లను నేర్పించాలని సూచించారు. అక్కడ పిల్లలకు సైక్లింగ్, వ్యాయామం తప్పకుండా చేయిస్తారని, టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉంచుతారని చెప్పారు. ఇక్కడి పిల్లల్లో కూడా అలాంటి మంచి లక్షణాలను పెంపొందించటం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్, విజయ వాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.రాజేంద్రబాబు, యునిసెఫ్ ప్రతినిధి రేషా ఎన్ దేశాయ్, ఐసిడిఎస్ జేడీ చిన్మయిదేవి తదితరులు పాల్గొన్నారు.

పిపిపి పద్ధతిలో ప్రయివేటు ఆసుపత్రులను ప్రోత్సహించడం తగదు

వార్త 5లో..

కోరం లేక వీగిపోయిన యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

వార్త మెయిన్ 3లో..

ఎయు బయోకెమిస్ట్రీకి మొదటి పేటెంట్

వార్త మెయిన్ 3లో..

జమ కాని ఉపాధి కూలి

- ఆర్థిక సంవత్సరం ముగిసినా ఇవ్వని డబ్బులు
- మూడు లక్షల మందికిపైగా కూలీల ఎదురుచూపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) కింద పనులు చేసిన కూలీలకు నెలల తరబడి ప్రభుత్వం కూలి చెల్లించలేదు. వేతన బకాయి విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ మార్చి 31వ తేదీ నాటికి కూలీలకు ఇవ్వాల్సిన రూ.51 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. నిబంధనల ప్రకారం పని చేసిన 15 రోజుల్లోపు కూలి చెల్లించాలి. లేదంటే కూలి చెల్లించని కాలానికి వడ్డీతో సహా కూలీలకు జమ చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లేని కూలీల ఉపాధికి భరోసాలేకుండా చేస్తోంది. వలసల నివారణ, ఉపాధి కల్పన లక్ష్యానికి ప్రభుత్వం తూట్లుపొడుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసినా ఆ కాలంలో చేసిన రూ.51 కోట్ల విలువైన పనులకు కూలి పూర్తిగా చెల్లించలేదు. జనవరి నుంచి మార్చి 31వ తేదీ వరకు రూ.51 కోట్లు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో జిల్లాలోని మూడు లక్షల మంది కూలీలు కూలి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. జనవరి నుంచి మార్చి 31వ తేదీ వరకు ఒక కూలికి వేల రూపాయల కూలి డబ్బులు రావాల్సివుంది. ఏప్రిల్ పనిదినాలు కలిపితే బకాయి ఇంకా పెరుగుతోంది.

జిల్లాలోని 24 మండలాలు, 645 పంచాయతీల్లో మంజూరుచేసిన 2.83 లక్షల జాబ్‌కార్డుల్లో 4.45 లక్షల కూలీలున్నారు. వీరిలో మూడు లక్షల మందికిపైగా పని చేశారు. ఒక కుటుంబానికి 59 రోజులు పని అధికారులు కల్పించారు. 29 వేల కుటుంబాలకు వంద రోజులు పని లభించింది. ఏడాదిలో కుటుంబానికి 200 రోజులకు పైగా పని కల్పించాలన్న కూలీల న్యాయమైన డిమాండ్‌ను అమలుచేయాల్సిన ప్రభుత్వం

మిగతా 2లో..

మార్చి నాటికి చెల్లించాల్సిన బకాయిలు

మండలం	బకాయి
అనకాపల్లి	3.13 కోట్లు
మాడుగుల	1.72 కోట్లు
రోలుగుంట	2.73 కోట్లు
అచ్యుతాపురం	72.27 లక్షలు
మాకవరపాలెం	3.22 కోట్లు
ఎస్.రాయవరం	3.95 కోట్లు
బుచ్చెయ్యపేట	2.69 కోట్లు
మునగపాక	1.73 కోట్లు
సబ్బవరం	1.94 కోట్లు
చీడికాడ	2.28 కోట్లు
నక్కపల్లి	2.97 కోట్లు
యలమంచిలి	1.36 కోట్లు
చోడవరం	1.37 కోట్లు
నర్సీపట్నం	2.19 కోట్లు
దేవరాపల్లి	1.70 కోట్లు
నాతవరం	1.77 కోట్లు
గొలుగొండ	2.37 కోట్లు
పరవాడ	84.71 లక్షలు
కె కోటపాడు	1.38 కోట్లు
పాయకరావుపేట	1.85 కోట్లు
కశింకోట	1.49 కోట్లు
రాంబిల్లి	1.94 కోట్లు
కోటవురట్ల	3.19 కోట్లు
రావికమతం	2.72 కోట్లు

మొదటి పేజీ తరువాయి..

పీలాకు మేయర్ లాంఛనమేనా!

అడకత్తెరలో పోకచెక్కమాదిరి మారిపోయింది.

కొసమెరుపు....

పీలా శ్రీనివాసరావుకు మేయర్ పదవి ఈనెల 28న జరిగే ప్రత్యేక సమావేశంలో దక్కుతుందన్న వాదన, ప్రచారం గట్టిగానే సాగుతున్నా టిడిపి అధిష్టానం నుంచీ ఇంతవరకూ ఎలాంటి సంకేతాలూ వెలువడలేదు. అదే రోజు 'షీల్డుకవర్‌'లో 'పేరు వస్తుందా? లేదా 'కూటమి' బడా నేతలకు సమాచారం వచ్చాక 28న చేతులెత్తి 'మేయర్‌'ను ఎన్నుకుంటారా? చూడాల్సిందే..!

జమ కాని 'ఉపాధి' కూలి

పనిదినాలు పెంచకపోగా, చేసిన పనికి సకాలంలో కూలి డబ్బులు కూడా చెల్లించకపోవడంతో కూలీలు అనేక రోజులుగా బకాయిలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు.

పది వారాల పేమెంటు ఇవ్వలేదు



పదివారాల నుంచి పనిచేస్తున్నాను. ఇంతవరకు ఒకరోజు కూలి కూడా చెల్లించలేదు. ఈ ఏడాది మార్చి వరకు ఏడు నెలలు, ఏప్రిల్‌లో మూడు వారాలు పనిచేశాను. కష్టపడిన రోజులకు డబ్బులు చెల్లించకపోతే ఎలా బతుకుతాం.

దార్ల నాగరత్నం, ఎన్.నర్సాపురం

కూలి బకాయి జమ చేయాలి



కూలి చెల్లించడంలో ప్రభుత్వం ఆలస్యం చేసింది. 13 వారాల బకాయి కూలీలకు రాలేదు. డబ్బులు విడుదలైనట్లు ప్రభుత్వం ప్రకటించినా కూలీలకు జమకాలేదు. చేసిన పనికాలానికి సకాలంలో ఉపాధి కూలీలకు కూలి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

డి.వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, అనకాపల్లి

సిపిఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిపిఐ విశాఖ జిల్లా 25వ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, మే 10,11 తేదీల్లో విశాఖ మురళీనగర్‌లో జరుగనున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ నగరం చుట్టుపక్కల ఉన్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడడానికి పార్టీ అనేక ఉద్యమాలు చేసిందని తెలిపారు. సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని, పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడే పోరాటాలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. నగరంలోని పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగ అవకాశాలు స్థానికులకు కల్పించాలని, విశాఖ నగరంలో మంచి నీటి సమస్య పరిష్కరించాలని, గాజువాక, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, హనుమంతువాక, కారుషెడ్ జంక్షన్, కొమ్మాది జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, జి.రాంబాబు, సిఎన్.క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో సమయపాలన పాటించాలి

అదనపు డిఎంఇ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, ఎన్‌టిఆర్ వైద్య సేవ కేసులను మరింత పెంచాలని అదనపు డిఎంఇ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన కింగ్ జార్జ్ హాస్పిటల్‌ను సందర్శించారు. ముఖ్యంగా హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీ (క్యాజువల్టీ) విభాగాన్ని పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పలు మార్గదర్శకాలు చేశారు. తర్వాత హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సందర్శించి, నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లు గురించి చర్చించారు. అనంతరం త్వరలో ప్రారంభించబోయే కొత్త వార్డులను కూడా పరిశీలించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, కెజిహెచ్ సూపరింటెండెంట్, హాస్పిటల్ ప్రతినిధులు, అన్ని విభాగాల హెడ్‌లు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోగుల సంరక్షణకు అవసరమైన పరికరాలను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిపి సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లన్నీ చెల్లించాలని, కొత్త కార్డులు రిజిస్ట్రేషన్ చేయాలని, రెన్యువల్ చేయాలని డిమాండ్‌తో గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే ధర్నాలో భవన నిర్మాణ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి జి.పోలేశ్వరరావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : కంచరపాలెం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. స్థానిక ధర్మానగర్, కంచరపాలెం సిద్ధార్థ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు ఇప్పిలి మల్లేశ్వరరావు తెలిపారు. ఎన్నికైన సభ్యులతో సీనియర్ సభ్యులు ముసిడిపల్లి రమణ, తీడ సన్యాసిరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రాజానమోహన్ పైడిరాజు మాట్లాడుతూ, ఇప్పటినుంచి సంఘ కార్యకలాపాలు సంఘ నూతన కార్యవర్గం చేపడుతుందని తెలిపారు. ఆదిలక్ష్మి జ్యూయలర్స్ అధినేత పి.ఎ.నాయుడు మాట్లాడుతూ, సంఘం సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణ, సలహా సభ్యులు బల్లంకి వెంకట్రావు, గంరెడ్డి రెడ్డి సన్యాసిరావు, సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఒక మత సంస్థ ఆస్తులను కబ్జాలు చేసుకునేలా ప్రోత్సహిస్తూ చట్టాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తూ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం–2025ను వెంటనే రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ డిమాండ్ చేశారు. చట్ట సవరణలో సమానత్వ, మత స్వాతంత్ర్య హక్కులను ఉల్లంఘించే నిబంధనలు ఉన్నాయని, ఇవి వక్ఫ్ ఆస్తులను కబ్జాదారులకు సొంతం చేయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మసీదులు, దర్గాలు, ముస్లిముల శ్మశాన వాటికల వద్ద అల్లర్లు సృష్టించే అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. ఏకపక్షంగా ముస్లిం మైనారిటీల ఉనికినే ప్రశ్నిస్తున్న ఈ చట్ట సవరణలు రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడిగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. పార్లమెంట్‌కు చట్ట సవరణలు చేసే అధికారం ఉన్నప్పటికీ, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే మార్చే అధికారం లేదని పలు సందర్భాల్లో సుప్రీం కోర్టు చెప్పిన విషయాలను గుర్తుచేశారు.

ఎండాడ రైతు బజార్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఎండాడ, సాగర్‌నగర్ తదితర ప్రాంత ప్రజల సౌకర్యార్థం రైతు బజార్ ఏర్పాటు చేయడానికి చురుకుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. రైతు బజార్ స్థలాన్ని ఎంపిక చేయడం కోసం మంగళవారం ఎండాడ, సాగర్ నగర్ పరిసరాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. మెయిన్ రోడ్డులోని ఎంకె.గోల్డ్ కోస్ట్ వెనుకనున్న స్థలంతో పాటు సుభాష్ నగర్ కమ్యూనిటీ హాల్ వెనకనున్న స్థలాన్ని కూడా పరిశీలించారు. సాధ్యాసాధ్యాల గురించి చర్చించారు. ఎంకె. గోల్డ్ కోస్ట్ వెనక ఖాళీగా ఉన్న పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా వంటి వసతులు అభివృద్ధి చేయాలని సూచించారు. ఎండాడ మెయిన్ రోడ్డుపై వాహన రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు పక్కన అనధికార షాపులు నడిపే వాళ్లకు అక్కడే ఉన్న ప్రభుత్వ భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రుషికొండ జంక్షన్‌లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి కల్యాణ మండపాన్ని నిర్మించాలని చెప్పారు. గొల్లలపాలెం స్కూల్ ఆవరణలో ఉన్న తుపాను షెల్టర్‌ను తక్షణమే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చెట్టిపల్లి గోపి, సారిపల్లి శ్రీనివాస్, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రి దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

డాక్టర్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ధరిత్రి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎపి స్టేట్ ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. ఎంవిపి కాలనీలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ధరిత్రి దినోత్సవం సందర్భంగా తాను సైతం పక్షులు, వన్యప్రాణులు కోసం నీరు మట్టి పాత్రలలో అందుబాటులో ఉంచానని, పిచ్చుకల కోసం గూళ్లు, ధాన్యం కంకుల కుచ్చులు ఏర్పాటు చేశానని తెలిపారు. సమస్త జీవరాశి జీవించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిచ్చుకలు 80 శాతం తగ్గిపోయాయని, వాటి పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిపిఐ జిల్లా కార్యాలయంలో లెనిన్ 155వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ప్రపంచ కార్మికోద్యమ వేగు చుక్క లెనిన్ అన్నారు. ప్రపంచం కార్మికులారా ఏకం కండు అని మార్క్స్ ఇచ్చిన పిలుపును అందుకొని రష్యాలో తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని లెనిన్ నిర్మించారని తెలిపారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయం సాధించిన తర్వాత, ప్రపంచంలో అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలు ఊపు అందుకున్నాయని వివరించారు. లెనిన్ చూపిన పోరాట స్ఫూర్తి భారత కమ్యూనిస్టు ఉద్యమంపై గొప్ప ప్రభావాన్ని చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, జి.రాంబాబు, సిఎన్.క్షేత్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యాన ఈ నెల 24వ తేదీన ఎన్‌ఎవిఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 55 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. గురువారం 9 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. సుమారు 3800 ఉద్యోగ అవకాశాలతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9948768778, 85558 68681 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఏదైనా డిప్లమో చదివిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీ.జీఓవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందని ఆధార్ నెంబరు, ఆధార్ లింక్డ్ మొబైల్ నెంబర్‌తో హాజరుకావాలని తెలిపారు.



నిర్మానుష్యంగా తగరపువలస జంక్షన్

ఉష్ణతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి..!

- మండుటెండల దెబ్బకు అల్లాడుతున్న ప్రజలు
- కర్ఫ్యూను తలపించేలా నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి- తగరపువలస : మండుటెండలకు తోడు వేసవి వడగాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉష్ణతాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరౌతున్నారు. సాయం సంధ్య వేళ దాటి చీకటి పడినా వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో నిత్యం జన సమ్మర్దం ఉండే ప్రాంతాలు బోసిపోయి కనిపిస్తున్నాయి మిట్ట మధ్యాహ్నం ప్రధాన రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించేలా ఉన్నాయి. . ఎండల తీవ్రతకు. ఇళ్లల్లోని గోడలు, వస్తువులతో పాటు, శరీరంపై ఉన్న దుస్తులు వేడెక్కుతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు టోపీలు ధరించి, గొడుగులు వేసుకొని ఇళ్ల వద్ద నుంచి బయటకు వస్తున్నారు. బైక్‌లు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే వారు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు . తడారే గొంతును పండ్ల రసాలు, తాటి ముంజెలు, మజ్జిగ, చల్లనినీటిని తీసుకుని ఉపశమనం పొందు తున్నారు. మండుటెండల దెబ్బకు చిన్న పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్య పీడితులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు వేసవి తొలిరోజుల్లో ఏప్రిల్‌లోనే ఎండలతీవ్రత ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏంటని జనం భయపడుతున్నారు.

జాగ్రత్తలు తప్పని సరి



ఎండల్లో వృద్ధులు, పిల్లలు సాధ్యమైనంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. మిగిలిన వారు అత్యవసరమైతేనేఉదయం 9 గంటల లోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత అదీ తగు జాగ్రత్తలతో బయటకు వెళ్లడం మంచిది.వడ దెబ్బకు గురి కాకుండా ఎప్పటికప్పుడు మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు వంటివి తీసుకోవాలి. పకోడీ, సమోసా, వేపుళ్ళు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఎండలో బయటకు వెళ్ళాల్సివస్తే గొడుగు, టోపీ, కళ్ళద్దాల రక్షణ అవసరం.

– డాక్టర్ ఎం ఫణి కుమార్, ప్రధాన వైద్యాధికారి, సిహెచ్‌సి, భీమునిపట్నం

నేరాలు ఘోరాలు

బైక్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి- పెందుర్తి: విశాఖ సిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో మోటార్ సైకిళ్లను దొంగిలించి ఒడిశాలో విక్రయించడానికి ప్రయత్నించిన తోటాడ నితిన్‌కుమార్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు బాలురిని పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.11 లక్షలు విలువ గల 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఎడిసిపి మోహనరావు తెలిపారు.. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ శ్రీనివాసరావు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో క్రైమ్ ఎసిపి లక్ష్మణరావు, ఎస్ఐ సూరిబాబు ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.కాశీ విశ్వనాథం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ వై.లక్ష్మనాయుడు తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్న సమాచారం అందడంతో ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్నారు. కాశీవిశ్వనాథం వద్ద నుండి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు లక్ష్మనాయుడు తెలిపారు. దాడులలో ఎస్సై ఎస్‌వి నారాయణ, సిబ్బంది సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో గంజాయి నిందితుల పట్టివేత

ప్రజాశక్తి- సీతమ్మధార :ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ల సాయంతో నిఘా, తనిఖీలు సత్ఫలితాలనిస్తున్నాయి. సిఐ బివి రమణ ఆధ్వర్యంలో సీతమ్మధార కొండ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో నిఘాపెట్టగా, గంజాయి, మత్తు పదార్థాలు తాగుతున్న ఐదుగురు యువకులను పట్టుబడ్డారు వారి నుంచి 50 గ్రాముల గంజాయి తో పాటు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బిలాల్ కాలనీ ప్రియదర్శిని కాలనీలకు చెందిన సాయి, ఆనంద్, మురళి, గణేష్, పవన్‌కుమార్‌లకు 41 సిఆర్‌పిసి నోటీస్ అందజేశామని సిఐ బివి రమణ తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

ప్రజాశక్తి -ఆనందపురం: వృత్తి విద్యా కోర్సులతో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చునని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జెజచంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం మండలంలోని లొడగలవానిపాలెం పంచాయితీ , నెల్లేరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులతో ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉపాధి పొందవచ్చునన్నారు. ఇంటర్ సెకెండియర్ విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సులో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్‌గా వేములవలసలో బాలాజీ బేకరీలో క్రాఫ్ట్, బేకరీపై పది రోజుల ప్రాక్టికల్ శిక్షణ పూర్తయిన సందర్భంగా వారికి సర్టిఫికెట్లను అందించి, అభినందించారు. జీసిడిఒ ఖలీసా బేగం, పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, శిక్షణ నిర్వాహకులు బి.స్వరాజ్యలక్ష్మి, రాష్ట్ర సమన్వయకర్త రుషి పాల్గొన్నారు.

త్వరితగతిన పిఎంశ్రీ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి -ఆనందపురం : పిఎంశ్రీ కింద ఎంపికైన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పథకం ప్రత్యేక నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అధికారి జోగ చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆనందపురం ఉన్నతపాఠశాలలో పిఎంశ్రీ నిధులతో ఆటస్థలం, కిచెన్ గార్డెన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. . పనులను వేగవంతం చేసి, నాణ్యతతో పూర్తిచేయాలని హెచ్‌ఎం కెఆర్‌కె.పట్నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్‌ను ఆదేశించారు అనంతరం ఆనందపురం ప్రాథమిక పాఠశాల నుంచి ఆరో తరగతిలో ప్రవేశానికి వచ్చిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు ఇచ్చి అభినందించారు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా విస్తృత ప్రచారం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిసిడిఒ ఖలీసా బేగం, ఎంఇఒ వి.జోగేంద్రనాథ్, సిఆర్‌పిలు షిణగం. శివాజీ ఉపాధ్యాయులు కెజియా, ప్రేమనాథ్, శంకరరావు, మహేష్, భాస్కరరావు, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 6వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సుల ప్రాధాన్యత, వాటి ఆవశ్యకతను సంస్థ నిర్వాహకులు వివరించారు. అభిరుచులను బట్టి కోర్సులను ఎంపిక చేసుకోవడం, ఏయే కోర్సులతో తొందరగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయో వివరించారు ప్రిన్సిపల్ గంగా కుమారి, సంస్థ నిర్వాహకులు ఉపకార్ కీర్తి, నాగేంద్ర, దినేష్ పాల్గొన్నారు

ప్రీడం కప్ విజేత ఆర్‌బిటి జట్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌బిటి జట్టు విజేతగా నిలవగా, ఫాల్కన్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఎబిసి అధ్యక్షులుకె శ్రీనివాసరావు , కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి అడిదం అంజనీ కుమార్, సభ్యులు లోవరాజు, కె రాము, మహేష్ పాల్గొన్నారు

పలువురు న్యాయమూర్తుల బదిలీలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాష్ట్రవ్యాప్తంగా 106 మంది జూనియర్ డివిజన్ న్యాయమూర్తుల సాధారణ బదిలీలలో భాగంగా విశాఖపట్నం జిల్లాలో పలువురు జూనియర్ న్యాయమూర్తులకు స్థానచలనం లభించింది. మూడేళ్లగా ఏడవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లలితాదేవిని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ప్రస్తుతం గుంటూరులో నాలుగవ అదనపు జూనియర్ డివిజన్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న కె శృతివింద బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నంలో ప్రస్తుతం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కం ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె శారద ఇదే కోర్ట్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా అదనపు బాధ్యతలతో బదిలీ అయ్యారు. విశాఖపట్నంలో నాల్గవ అదనపు జూనియర్ డివిజన్ కం రెంట్ కంట్రోల్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న నికిత సింగర్‌ను మూడవ అదనపు జూనియర్ డివిజన్ న్యాయమూర్తిగా అనకాపల్లి బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ స్థానానికి న్యాయమూర్తులు కేటాయించలేదు. ఖాళీగా ఉన్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విజయనగరం జిల్లా చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ న్యాయమూర్తి బదిలీపై వస్తున్నారు.

భీమిలిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి స్పందన ఎక్సైజ్ కోర్టు గుంటూరుకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో భీమిలిలో ఒకటవ అదనపు జూనియర్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న డి సౌజన్య బదిలీ అయ్యారు. ప్రిన్సిపల్ జూనియర్ డివిజన్ ఎలమంచిలి న్యాయమూర్తి పి స్వాతిభవన్ భీమిలి ఒకటో అదనపు జూనియర్ డివిజన్ న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. ఎప్పటినుండో ఖాళీగా ఉన్న మాడుగుల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు నెల్లూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నల్లబోలు లావణ్య బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నం జిల్లా పాడేరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా (ఖాళీ)ఏ రాము శ్రీకాకుళం జిల్లా సోంపేటలో ప్రస్తుతం అదనపు జూనియర్ డివిజన్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న వారు వస్తున్నారు. ఎలమంచిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న టి వీర రాఘవేంద్రను నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తూర్పుగోదావరి జిల్లా రామచంద్ర పురానికి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో విజయనగరం జిల్లా సాలూరు నుండి కె రమేష్ వస్తున్నారు. వీరంతా కొత్త స్థానాల్లో వచ్చేనెల రెండవ తేదీలోపు విధుల్లో చేరాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

సర్వీస్ రోడ్డులో అడ్డగోలుగా బారికేడ్లు

వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇక్కట్లు - కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : కార్పొరేటర్

ప్రజాశక్తి -ములగాడ: స్థానిక నేవల్ కళ్యాణి ఆసుపత్రి వద్ద సర్వీస్‌రోడ్డులో నేవల్ అధికారులు అనధికారికంగా 500 మీటర్లు పొడవునా బారికేడ్లు అమర్చడంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారి ఇబ్బందులు పడడంతోపాటు ప్రమాదాలకు గురౌతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో వాహనరద్దీతోపాటు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఇక్కడ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితుల్లో బారికేడ్లతో ఇరుకుగా మారిన రహదారి వద్ద రోడ్డు మధ్యన నడవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం స్థానిక 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బైక్‌పై అటు వెళ్తుండగా, కళ్యాణి ఆసుపత్రి వద్ద బైక్ ఆపి, ఇబ్బందులను పరిశీలిస్తున్న క్రమంలో నేవల్ అధికారులు అక్కడికి వచ్చి దురుసుగా ప్రవర్తించారని కార్పొరేటర్ ఆరోపిస్తు న్నారు. సర్వీసురోడ్డును ఆక్రమించి బారికేడ్లు ఏర్పాటుతో ఇబ్బందులు సృష్టించడమే కాకుండా దురుసుగా వ్యవహరిస్తున్న నేవల్ అధికారుల తీరుపై జిల్లాకలెక్టర్ దృష్టికి తీసుకెళ్ల తానని నాగేశ్వరరావు అంటున్నారు.



కార్పొరేటర్ నాగేశ్వరరావుతో నేవల్ అధికారి వాగ్వాదం

హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని అనంతవరం, పద్మనాభం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కెవివి.చౌదరి అన్నారు. మంగళవారం ఆయా హాస్టళ్లను పరిశీలించారు వచ్చే విద్యాసంవత్సరానికి ఆయా హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ, ఎఇఇలు ఉన్నారు.

'అవంతి'లో వరల్డ్ ఎర్త్ డే

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం వరల్డ్ ఎర్త్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకుబహుమతులు , సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్ర శేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, బేసిక్ సైన్స్ విభాగాధిపతి పట్నాయక్, జి చిన్నయ్య, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు

ఎస్‌సి, ఎస్‌టి సెల్ స్పెషల్ డిఎస్‌పిల

వ్యవస్థను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల ద్వారా 2014లో ఏర్పాటై, గతేడాది రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టి సెల్ స్పెషల్ పోలీస్‌స్టేషన్లలో డిఎస్‌పి వ్యవస్థను పునరుద్ధరించాలని బహు జనసేన రాష్ట్ర అధ్యక్షుడు చందు కోరారు. గతేడాది రాష్ట్రంలో 98 మంది ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ పోలీస్‌స్టేషన్ల డిఎస్‌పి పోస్టులను గత ప్రభుత్వం గుట్టుగా రద్దు చేసిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరచడానికి, బాధితులకు మెరుగైన సత్వర న్యాయాన్ని అందించడానికి ఏర్పాటుచేసిన ఈ వ్యవస్థలోని డిఎస్‌పి పోస్టుల రద్దు సరికాదన్నారు. దీనిపై జాతీయ ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, డిజిపికి లేఖ రాయించి సమస్య పరిష్కరించాలని సూచించామన్నారు.

రాష్ట్ర హోం మంత్రి అనితకు విన్నవించగా, కొంత సమయం కావాలని కోరారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని ఈ వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా పోస్టుల కోసం ఎదురుచూస్తున్న డిఎస్‌పిలకు, ప్రమోషన్ల కోసం వేచియున్న సిఐలకు మేలు చేయాలని, అలాగే బాధిత ఎస్‌సి, ఎస్‌టిలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్‌సి,ఎస్‌టి సంఘాలను, ఇతర ప్రజాసంఘాలతో విజయవాడలో ధర్నా చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షు లు బొడ్డు కళ్యాణరావు, విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక అధ్య క్షులు బూసి వెంకటరావు, భీంసేన చిన్నారావు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు దుర్గారావు, అప్పలరాజు, బొడ్డు కృష్ణ ,మానవ వికాస్ వేదిక మూర్తి, పృథ్వీరాజ్, గన్నెల మనోహర్‌రెడ్డి, మూడే రూపనాయక్, భాను ప్రకాష్, బన్నీ పాల్గొన్నారు.

పద్మనాభం ఎపిఒగా గౌరి

ప్రజాశక్తి- పద్మనాభం. మండలంలోని ఉపాధి హామీ పథకం ఎపిఒగా జివిఎస్ గౌరి మంగళవారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని 18 పంచాయతీల్లో నీటితొట్టెల నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి



ఎంపి శ్రీభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇపిఎస్ పెన్షనర్లు

ప్రజాశక్తి -తగరపువలస : ఇపిఎస్ 95 పింఛనుదారులందరికీ హయ్యర్ పెన్షన్‌తోపాటు కనీస పింఛను రూ 9 వేలు ఇవ్వాలని చిట్టివలస జ్యూట్‌మిల్లు పింఛను దారుల సంఘం నాయకులు కోరారు. మంగళవారం విశాఖలోని ఎంపి శ్రీభరత్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు .సీనియర్ సిటిజన్లకు రైల్వేఛార్జీ రాయితీ పునరుద్ధరించాలని కోరారు. ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన వారిలో ఇపిఎస్95 పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హుస్సేన్, చిట్టివలస పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ప్రధానకార్యదర్శి దామోదర బాబాజీ, కోశాధికారి పంపాన సూర్యనారాయణ, టిడిపి నాయకులు పిట్ట సురేష్, ఎంవి గురుమూర్తి ఉన్నారు

ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలి

పోర్టు ఆసుపత్రి వద్ద 204వ రోజుకు చేరిన దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న సిఐటియు నేతలు ,కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్‌జుబ్లీ ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణకు పిలిచిన టెండర్లను పూర్తిగా రద్దుచేయాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్, విడిఎల్‌బి యూనియన్(సిఐటియు), పెన్షనర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పోర్ట్ గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి వద్ద 204వ రోజు నిరసనలో యూనియన్ కార్యదర్శి బి జగన్ మాట్లాడుతూ ఈనెల 28న ఓపెన్ చేయాలన్న ఆసుపత్రి టెండర్లను పూర్తిగా రద్దు చేయాలన్నారు. కార్మికుల కృషితో ఈ ఏడాది రూ.724.4 కోట్ల లాభాలను సొంతం చేసుకున్న విశాఖపట్నం పోర్ట్, రూ.171 కోట్ల పన్నులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లిస్తోదన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో పోర్టు ఆసుపత్రిని సొంత నిధులతో కాకుండా అభివృద్ధి చేయకుండా ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. 40వేలమంది పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల కుటుంబీకుల ఆరోగ్యభద్రతను దూరం చేసి, ప్రయివేటుకు దారాదత్తం చేయడం బాధ్యతా రాహిత్యమన్నారు. పోర్టు యాజమాన్యం, కేంద్రప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో సిఐటియు నాయకులు కె.సత్య నారాయణ, జె.సత్యనారాయణ, బి లక్ష్మణరావు, గణేష్, సంకలు ఎల్లారావు, రాఘవులు, నాయుడు , కెఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఆలిండియా స్కేటింగ్ పోటీలకు లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -ఆనందపురం : అండర్ 14 ఆలిండియా స్కేటింగ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇటీవల రాజస్తాన్ బాన్సువాడలో నిర్వహించిన ఆల్ ఇండియా విద్యా భారతి స్కేటింగ్ అండర్-14 పోటీలలో లక్ష్మీనారాయణ ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడనిపాఠశాల పిఈటి శ్రీనివాసరావు తెలిపారు.చదువుతోపాటు స్కేటింగ్ పోటీల్లో రాణిస్తున్న లక్ష్మీనారాయణను పలువురు అభినందించారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు దరఖాస్తులు

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా.. తహశీల్దార్ కార్యాలయంలో వినతి



తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : మధురువాడ, ఆరిలోవ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్న లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు జిఒ 30 ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్ చేసారు. అలాగే 2015, 2017లో జిఒలు 296, 388 ప్రకారం ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.ఈ సందర్భంగా 700ఇంటి పట్టా దరఖాస్తులను డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌కు అందజేశారు.

మంగళవారం సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో చినగదిలిలోని విశాఖ రూరల్ తహశీల్దారు కార్యాలయం వద్ద వేలాది మందితో ఆందోళన చేపట్టారు. జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ 40 ఏళ్ళుగా ప్రభుత్వ భూములు, పోరంబోకు, కొండవాలు, మురికివాడల ప్రాంతాల్లో రేకుల షెడ్డులు, శ్లాబులు వేసుకొని జీవిస్తున్న వారికి, వివాదస్పద స్థలాల్లో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు.

విశాఖ. కేంద్రకారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో కొన్నేళ్లుగా నివాసముంటున్న 600 మంది బడుగులకు వాటర్ క్యాచ్‌మెంట్ ఏరియా సాకుతో ఇంటిపట్టాలు ఇవ్వకుండా మోసగిస్తున్నారని, ఇపుడు అదే ప్రాంతంలో రైల్వేజోన్‌కు స్థలం కేటాయించారన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చేందుకు కొరగాని భూములు, రైల్వేజోన్ భవనాలను ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. కబ్జాదారులకు, రాజకీయ అండదండలు ఉన్నవారికి నిరభ్యంతరంగా పట్టాలు జారీ చేస్తున్న అధికారులు, నిజమైన పేదల నివాస స్థలాలకు కొర్రీలు వేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అర్హులకు పట్టాలు ఇవ్వకుంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మద్దిలపాలెం జోన్ సభ్యులు డి. అప్పలరాజు, డి.కొండమ్మ, డి.నాగరాజు, పి.శంకర్రావు, పి. వెంకటరావు, కె.కుమారీ, కాంత, ఐసినాయుడు, జె.ఆర్. నాయుడు, రామకృష్ణాపురం గ్రామ సంఘం నాయకులు వంకర బాబూరావు, కాకర గోవిందు పాల్గొన్నారు.

నాగభూషణరావు మరణం తీరనిలోటు

నేడు వేములవలసలో కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పెద్దకర్మ



కోరాడ నాగభూషణరావు(ఫైల్)

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలో ఎవరికి ఆపద వచ్చినా, ఏ గ్రామంలోనైనా గుడి, గోపురం నిర్మించిన, పండగలు, ఉత్సవాలు జరుపు కున్నా, ఆయా వేడుకలకు ముందుగా విరాళాలు ఇచ్చే వ్యక్తిగా గుర్తొచ్చేది కోరాడ నాగభూషణరావు. నియోజకవర్గంలో మనసున్న మారాజుగా పేరుపొందారు. ఈ నెల 10న ఆయన అకాల మరణంతో అభిమానులు నియోజకవర్గ ప్రజలు శోకసముద్రంలో మునిగారు. వేములవలస గ్రామానికి చెందిన కోరాడ నాగభూషణరావు 30 ఏళ్లపాటు ప్రజా సేవలో ఉన్నారు. కోరాడ అప్పలస్వామి, నర్సమ్మ దంపతులకు 3వ సంతానంగా జన్మించిన కోరాడ నాగభూషణరావు 2001 నుంచి 2006 వరకు వేములవలస సర్పంచ్‌గా, 2013 నుంచి 2018 వరకు తెలుగుదేశం మండల పార్టీ ప్రెసిడెంట్‌గా 2017 నుంచి 2019 వరకు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. భీమిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేనినాయకుడిగా, సౌమ్యుడిగా, ప్రజాసేవకుడిగా మంచి గుర్తింపు పొందారు. ఎన్నో సందర్భాలలో చంద్రబాబు ఆశీస్సులు పొందా వేములవలసలో పాతికేళ్లుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. ఆయనకు భార్య కోరాడ అరుణ్ జ్యోతి, కుమారుడు నవీన్ జ్ఞానేశ్వరరావు (ఉప సర్పంచ్ వేములవలస), సోదరులు కోరాడ చంద్ర జగన్నాథరావు సన్యాసిరావు,ˆూర్యారావు. ఉన్నారు. నాగభూషణరావు మరణం తీరనిలోటని, ఆయన సోదరుడు సూర్య హోటల్ అధినేత కోరాడ సూర్యారావు, మేనల్లుడు షినగం దామోదరరావు (దాము) తెలిపారు. ఈనెల 23న పెద్దకర్మ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వైద్య విద్యార్థుల శాంతి ర్యాలీ



వెలిగించిన కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేస్తున్న వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : ఇటీవల మనస్తాపంతో కాలేజీ భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న తోటి మెడికో శీరం ప్రవీణ్‌దత్త ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ స్థానిక సంగివలస ఎన్నారై వైద్య కళాశాల వైద్యవిద్యార్థులు మంగళ వారం సాయంత్రం వెలిగించిన కొవొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రణీత్‌దత్త అమర్ రహే అంటూ నినాదాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు.

సాయి విద్యానికేతన్ విద్యార్థుల ట్రెక్కింగ్



జింక్ కొండపై ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు.

ప్రజాశక్తి -గాజువాక : జిల్లా స్కౌట్స్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో. స్వామి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం పలు ఏరియాల్లో పర్యటించారు. సాయిరాం నగర్, శంకర్‌నగర్, పాత గాజువాక, కొత్తగాజువాక, బిసి రోడ్ జంక్షన్ మీదుగా, జింక్ గేటు నుంచి కృష్ణానగర్ కొండపైన ట్రెక్కింగ్ నిర్వహించారు.. ప్రకృతి పరిశీలనకు బయలుదేరిన విద్యార్థులందరూ ముందుగా జింక్ శివాలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సింగిరెడ్డి లక్ష్మి, ఎస్ రూపలత, అచ్యుత, సుబ్బలక్ష్మి, కుమార్ పాల్గొన్నారు..

వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు



సిబిఐ మాజీ జెడి నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి -ములగాడ: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కృత్రిమ మేధస్సు- బాధ్యతాయుత వినియోగం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పి.దివ్యశ్రీ, ఇ.స్రవంతి, కె.యామిని ప్రతిభ కనబరిచారు. సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మినారాయణన ఉంచి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. హెచ్‌పిసిఎల్. విశ్రాంత ప్రజా సంబంధాల అధికారి ఎంకెవిఎల్.నరసింహం, ఇపిఎస్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి



కెజియా దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గాదె, సహచరులు

ప్రజాశక్తి - ఆనందపురం : ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని, విధుల్లో ఉండగా చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులు నాయుడుఅన్నారు. మంగళవారం ఆనందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న గణిత ఉపాధ్యాయిని వైవి కెజియాను పాఠశాలలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సమక్షంలో ఎమ్మెల్సీ గాదె ఘనంగా సన్మానించారు. 18ఏళ్లకే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, 42 ఏళ్లపాటు సుదీర్ఘకాలంగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎంఇఒ జోగేంద్రనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదన్నారు. హెచ్ఎం కెఆర్‌కె. పట్నాయక్ మాట్లాడుతూ, ఈనెలాఖరున కెజియా ఉద్యోగ విరమణ చేస్తున్నప్పటికీ, వేసవి సెలవులు కావడంతో సహచరులు, విద్యార్థులు ముందుగా సత్కరించడం అభినందనీయమన్నారు కెజియా మేడం జీవితచరిత్ర, ఉపాధ్యాయ వృత్తిలో ఆమె చేసిన సేవలను పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మహేష్ పద్మరూపంలో సన్మానపత్రం తయారుచేసి, చదివి వినిపించి అందజేశారు. కెజియా భర్త అదే పాఠశాలలో పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగినిగా,గృహిణిగా ఆమె సేవలు ప్రశంసనీయమన్నారు కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, ఎంపిటిసిలు బంటుబిల్లి అప్పలస్వామి, రెడ్డి బాబు, కొట్టాడ సత్యమూర్తి, ఎస్ఎంసి చైర్మన్ బంటుబిల్లి లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శంకరరావు భాస్కరరావు, ప్రసాద్, కె.వెంకటప్రసాద్, బంగారం, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు

రమణికుమారికి సత్కారం



రమణ కుమారి దంపతులను సత్కరిస్తున్న మాలినాయుడు

ములగాడ: ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న త్రినాథపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణి కుమారిని మంగళవారం ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పాల్గొని రమణి కుమారి దంపతులను సత్కరించి, ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, కరణం గంగాధర్, బగాది మల్లేశ్వరరావు, చింతా ప్రభాకర్ ఐదో జోన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

పిపిపి పద్ధతిలో ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించడం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

పిపిపి పద్ధతిలో ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించాలన్న పేరుతో అనకాపల్లిలో హెల్త్ సిటీ కింద 7.68 ఎకరాలను ప్రయివేటు ఆసుపత్రులకు అప్పజెప్పే వివిఎంఆర్‌డిఎ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. పరిశ్రమల ప్రమాదాల పేరుతో ప్రయివేటు ఆస్పత్రులకు చౌకగా భూములు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో బర్నింగ్ వార్డ్, ఇతర మల్టీస్పెషాలిటీ తరహా వైద్యం సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే పరిశ్రమల ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అచ్యుతాపురంలో ఏర్పాటు చేస్తున్న ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాలు తొందరగా పూర్తిచేసి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రమాద బాధితులకు వైద్యం అందించాలనే పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహించే చర్యలు మానుకోవాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విలువైన ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల టాటా కంపెనీకి విశాఖపట్నంలో ఎకరం 99 పైసలు చొప్పున 21 ఎకరాలు కారుచౌకగా ఇచ్చారని తెలిపారు. విశాఖ నగరంలోని ఆరిలోవ హెల్త్ సిటీలో ప్రభుత్వ స్థలాలను చౌకగా పొందిన ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు ఉచిత వైద్యం అందించడం లేదని గుర్తు చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తే పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు స్థలాలు ఇచ్చే ఆలోచనలను విరమించుకొని, అచ్యుతాపురంలో ఇఎస్ఐ, జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చేలా నిధులు కేటాయించాలని కోరారు. ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి పిపిపి ఒక ముసుగు మాత్రమేనని పేర్కొన్నారు. పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను అచ్యుతాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగునకు వినియోగించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

గ్రామీణ విద్యార్థుల అధ్యయన, అవగాహన టూర్

ప్రజాశక్తి-అనకాపల్లి : డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అనకాపల్లి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధ్యయన, అవగాహన పర్యటనను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా పర్యటనలు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించడం ద్వారా వారి అభ్యాసనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా చేస్తాయని తెలిపారు. విద్యా పర్యటనలు విద్యార్థులకు పుస్తకాల్లో చదివిన విషయాలను నిజ జీవితంలో చూడటానికి అనుభవించడానికి సహాయపడతాయని చెప్పారు. ఇది వారి జ్ఞానాన్ని బలపరుస్తుందని, వారిలో పరిశీలనా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి సుమారు 96 మంది విద్యార్థులు, 15 గైడ్ టీచర్లతో పాటు జిల్లా సైన్స్ అధికారి ఏఎంఓఈ టూర్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ టూర్‌లో విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీలో గల న్యూక్లియర్ ఫిజిక్స్ ల్యాబ్, ఫిజిక్స్ డిపార్ట్మెంట్, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ బోటనీ, జూవాలజీ ల్యాబ్స్ సందర్శించి, తదుపరి విశాఖ బీచ్ లో గల సబ్మెరైన్, టి20 ఎయిర్ క్రాఫ్టు, విశాఖ మ్యూజియం సందర్శించారని తెలిపారు. జిల్లాలో ఈ సంత్సరం జనవరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన చేసిన 96 మంది విద్యార్థులను ఉత్తమ ఉపాధ్యాయులను రెండు ఆర్టీసీ బస్సులలో విశాఖపట్నం వైజ్ఞానిక యాత్రకి పంపించడం జరిగిందని తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ డి.కాళిదాస్, మురళీమోహన్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ స్టడీ టూర్ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణపై సంబరాలు

ప్రజాశక్తి-సబ్బవరం : ఎంఆర్‌పిఎస్ పెందుర్తి నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి, మండల కన్వీనర్ బొర్రా జయరాజు ఆధ్వర్యంలో మండలంలోని సాయినగర్ కాలనీలో షెడ్యూల్ కులాల వర్గీకరణ విజయోత్సవ సంబరాలు మంగళవారం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్, నీటిపల్లి ముత్యాలు, గొటివాడ సన్యాసి, దువ్వు దుర్గాలు, కొమ్ము కోటి, ఇండుగుబిల్లి పరదేశి, నీటిపల్లి సోమేశ్వరరావు, దువ్వు మనోహర్, కణితి సింహాచలం, పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల ప్రయోజనాలపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : వరి నూర్పుడి యంత్రం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. మండలంలోని ఎం.అలమండ గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శశిధర్ రెడ్డి, ఏవో పి.సురేష్ బాబు, ఆర్ గాయత్రి(ఏవో), స్థానిక వ్యవసాయ అధికారిణి ఎల్.వై. కాంతమ్మ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఒక ఎకరం వరి పంట నూర్పడానికి రూ.4800 సరిపోతుందని, కూలీలు కొరతను దృష్టిలో పెట్టుకొని మిషన్ వినియోగించుకోవాలని సూచించారు. వరి, మినుములు, మొక్కజొన్న పంటలు నూర్పిడి చేసుకునేందుకు మిషన్ ఉపకరిస్తుందన్నారు. మండలంలో నాలుగు నూర్పుడి మిషన్లు పంపిణీ చేయగా, వారిలో ఎస్‌టి-1, ఎస్సీ-1, బీసీ-2 క్యాటగిరీ వారిగా పంపిణీ చేశామన్నారు. యంత్రం ఖరీదు రూ.2,60,000 కాగా, జనరల్ క్యాటగిరీకి రూ.80,000 సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ వారికి లక్ష రూపాయలు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నేడు పరవాడలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుండి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ గండి బాబ్జి ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు.

గిన్నిస్ బుక్‌లో గురుకుల విద్యార్థులకు స్థానం



గిన్నిస్ బుక్ రికార్డుల పత్రాలు చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన 13 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు తెలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. తమ విద్యాలయం విద్యార్థులు రసాయన శాస్త్రంలో పిరియాడిక్ టేబుల్ని, ఫిజిక్స్ కాన్స్టెంట్ వాల్యూస్, ఫిజిక్స్ ఫార్ములాస్, కెమిస్ట్రీ ఫార్ములాస్‌ను అతి తక్కువ సమయంలో చెప్పినట్లు పేర్కొన్నారు. దీనికి గాను 13 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తమ స్కూలుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించినట్లు చెప్పారు. బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి వి.వి.బుచ్చిరాజు, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సిఐ పి.రమణ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ వివిజె వేణుగోపాలరావు, వెల్ఫేర్ ఇంజనీరింగ్ కాలేజీ కెమిస్ట్రీ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ కే.జయరావు, డాక్టర్ మూర్తి సమక్షంలో జె.నిశాల్ పిరియాడిక్ టేబుల్ను 16 సెకండ్లలోను, డి.విశ్వనాథ్ 18 సెకండ్లలోనూ, బి మనోహర్ 19 సెకండ్‌లోను, ఎల్.తనుష్ 21 సెకండ్‌లోనూ, ఎం.అశోక్ 21 సెకండ్‌లోనూ, కె.శివ హేమంత్ 21 సెకండ్‌లోనూ, కె.సుధాకర్ 21.సెకండ్‌లోనూ, జె.సంపత్ వినయ్ 22 సెకండ్‌లోనూ, జె.సందీప్ 22 సెకండ్లలోనూ, విజయ్ కుమార్ 22 సెకండ్‌లోనూ, కె.యోగేంద్ర 22 సెకండ్‌లోనూ, పి.ప్రవీణ్ 22 సెకండ్‌లోనూ, భరద్వాజ 23 సెకండ్లులోను చెప్పినట్లు వెల్లడించారు. వారిని గైడ్ చేసిన డాక్టర్ టి.రాంబాబు పిరియాడిక్ టేబుల్‌ని 37 సెకండ్‌లో పఠించారు. వీటితో పాటుగా ఫిజిక్స్ కాన్స్టెంట్ వాల్యూస్, ఫిజిక్స్ ఫార్ములాస్ మరియు కెమిస్ట్రీ ఫార్ములాస్ కూడా చెప్పారు. అలాగే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో గతంలో పిరియాడిక్ టేబుల్‌ని 22 సెకండ్స్‌లో చెప్పారని, తమ విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులు జె.నిశాల్ 16 సెకండ్ లోనూ డి. విశ్వనాథ్ 18 సెకండ్ లోనూ, బి.మనోహర్ 19 సెకండ్‌లోను చెప్పి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అధిక మించినట్లు చెప్పారు. దీనికి కారణమైన గైడ్ టీచర్, సైన్స్ టీచర్ టి.రాంబాబును, ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణను విశాఖపట్నం అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త సి.ప్రభావతమ్మ అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో వికలాంగ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ- సమగ్ర శిక్ష ప్రాజెక్టు స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ తోటపల్లి హిల్ పారడైజ్ స్కూల్ ఈనెల 21 నుండి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న క్రీడల్లో అనకాపల్లి జిల్లా వికలాంగ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. మేధో వైకల్యం, ఆటిజం, డౌన్ సిండ్రోమ్, మస్తిష్క పక్షవాతం వైకల్యాలు గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకుఈ క్రీడా పోటీల్లో నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలలో అనకాపల్లి జిల్లా నుండి నలుగురు విద్యార్థులు పాల్గొని ఐదు పతకాలను సాధించారు. అసిస్టెడ్ వాక్ క్రీడా పోటీల్లో అనకాపల్లి జిల్లా పరవాడ మండలానికి చెందిన ఎం.శ్రావణ్ జోషిత్ ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్‌ను, అనకాపల్లి మండలానికి చెందిన ధోని భాస్కర్ 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్‌ను, రావికమతం మండలానికి చెందిన మల్లేటి ఆనంద్ 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్‌ను, 50 మీటర్ల మీటర్ల పరుగు పందెం విభాగంలో బుచ్చయ్యపేట మండలానికి చెందిన బి.మనోజ్



ప్రతిభ చూపిన వికలాంగ విద్యార్థులు

తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. ఎపి సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకులు ఎం. రవీంద్రనాథ్ రెడ్డి, ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎమ్. వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందుకున్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పతకాలను సాధించిన వికలాంగ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఉన్నత అధికారులు అభినందించారు. ఈ విద్యార్థులకు ఎస్కార్టుగా వ్యవహరించిన స్పెషల్ ఎడ్యుకేటర్లు మహాలక్ష్మి నాయుడు, పోలిరాజును అధికారులు ప్రసంశించారు.

భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డిఓ షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల తనిఖీలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేస్తున్నారు తప్ప భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు భద్రత ప్రమాణాలు పాటించిన పరిశ్రమలపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. భద్రతా పరమాణాలు పాటించకపోవడంతో కార్మికులు ప్రమాదాల బారిన బడి మృత్యువాతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, కొల్లి చిన్న అప్పారావు, కొట్టుమూరు మంగరాజు, బొబ్బిలి గోవిందరాజు, వాసుపల్లి తాతయ్యలు, ముగడ అప్పారావు, కొల్లి సత్యారావు, కుంచావారి చిన్ను, సరిసా చిరంజీవి, గ్యాస్ అప్పారావు, ఎస్ గణపతి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 171 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లి ఆదినారాయణ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 171 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవింద రావు, కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ జాబ్ మేళాకు సుమారుగా 15 ఎమ్మెల్సీ కంపెనీలు హాజరయ్యాయని, 1100 ఖాళీలు వివిధ కంపెనీలలో ఉన్నాయని పేర్కొన్నారు. జాబ్ మేళాలో 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనగా 455 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా 171 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం లో సుమారు 50 మందికి ఉద్యోగ మేళా నిర్వహించిన చోటే ఉద్యోగ నియామక పత్రాలు అందించటం జరిగింది.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని మైహోం ప్రైవేట్ ఇండస్ట్రీ లిమిటెడ్ శ్రీనగర్ వెంకన్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో చివరి రోజు కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగినట్లు ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి.రామస్వామి తెలిపారు. ముగింపు ఉత్సవం చినజియ్యర్ స్వామి సమక్షంలో జరిగిందన్నారు. కార్యక్రమంలో మైహోం అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, మైహోం గ్రూప్ వైస్ చైర్మన్ వినోద్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ పాండే, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎక్స్ ఎమ్మెల్యే కన్నబాబురాజు, గ్రామపెద్దలు, అధికారులు, పరిసర గ్రామ ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : డిప్యూటేషన్ వచ్చి ఎంతో బాధ్యతతో పని చేసిన ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎ.కొత్తపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత మంగళవారం సత్కరించి అభినందించారు. మండలంలోని ఏ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గతేడాది సెప్టెంబర్ నెలలో వర్క్ అడ్జస్ట్మెంట్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు బి.నాగరాజు, అరుణకుమారి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇద్దరు ఉపాధ్యాయులు తమ విధులను చక్కగా నిర్వర్తిస్తూ విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది విలువలతో కూడిన విద్యను అందించినందుకు పాఠశాల, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ చైర్మన్ ఎల్. అప్పల నరసయ్య తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

అవిశ్వాసాన్ని ఓడించి ప్రజల విశ్వాసం పొందాం

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



విజయ చిహ్నం చూపుతున్న ఎమ్మెల్యే, కూటమి నేతలు

ప్రజాశక్తి-యలమంచిలి : అవిశ్వాసాన్ని ఓడించి ప్రజల మన్ననలు పొంది వారి విశ్వాసానికి దగ్గరయ్యామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు జనసేన కూటమి నాయకులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖలో మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించి విజయం సాధించామని, ఇక్కడ ఛైర్పర్సన్ విశ్వాసం ప్రకటించి అవిశ్వాసాన్ని ఓడించామని చెప్పారు. ప్రజల కోసం నిలబడే నాయకుల పట్ల ప్రజలు విశ్వాసం ప్రకటిస్తారని ఇవాళ యలమంచిలిలో రుజువైందన్నారు. పార్టీ మారారనే నేపంతో ఛైర్పర్సన్‌ను స్వార్థంతో దించాలని చూశారని, వైసిపిలో ఉంటే భవిష్యత్ శూన్యమని భావించిన వారు అందులో ఇమడలేక బయటపడుతున్నారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జనసేన రూరల్ అధ్యక్షులు అన్నం బాబ్జీ, ఊటకూటి రమేష్, లాలం సోమునాయుడు, కొఠారి శ్రీనివాసరావు, చిట్టిబాబు, నక్కా శివశంకర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారుల్లో పదవిని కాపాడుకున్నారు : కన్నబాబురాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి-యలమంచిలి : వైసిపి జెండాతో గెలిచి అందలం ఎక్కిన తర్వాత పార్టీ మారిన వ్యక్తులు అడ్డదారుల్లో పదవిని కాపాడుకున్నారని, అటువంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం అండగా నిలవడం అనైతికమని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం ఆయన 11 గంటల సమయంలో యలమంచిలిలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కౌన్సిలర్లను చేరదీసి పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. తమకు 16 మంది సభ్యుల బలం ఉంటే రాత్రికి మరో ఇద్దర్ని తరలించుకు పోయినట్లు చెప్పుకొచ్చారు. 17 మంది కోరం ఉండాల్సిన సమావేశానికి తమ వద్ద ఉన్న 14 మందితో నెగ్గలేమని తెలిసి సమావేశాన్ని బహిష్కరించామని వివరించారు. తుని, విశాఖపట్నంలో కూడా అధికారం, డబ్బు అడ్డం పెట్టుకుని విజయాలు సాధించామని చెప్పుకోవడాన్ని ఖండించారు. బలా బలాలు ప్రజాక్షేత్రంలోనే తేలుతాయన్నారు. ఇకమందు మున్సిపాలిటీలోని వైసిపి సభ్యులు అభివృద్ధి కార్యక్రమాల మీదే దృష్టి సారిస్తారని తెలిపారు.. కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవిందరావు, వైస్ ఛైర్పర్సన్లు బెజవాడ, ఆరెపు గుప్తాతో కలిపి 14 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హాస్టళ్ల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులతో పరవాడ గర్ల్స్ హాస్టల్, పరవాడ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ మంగళవారం పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గుంటూరు శ్రీనివాస్, జి.చంద్ర శేఖర్, అజ్జీరా వెంకటేశ్వరరావు, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ సుజాత, గూడ సుధాకర్, టి రాజలింగం, కె నారాయణరావు, కె తాతబాబు, జె చిట్టిబాబు, ఎస్ ప్రసాద్, కె మహేష్, జి చినబ్బాయి, జె.ఆదయ్య, కెకె సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శిగా తరుణ్‌తేజ

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ చోడవరం నియోజకవర్గ ప్రోగ్రాం కార్యదర్శిగా జోగ తరుణ్ తేజను నియమించినట్లు జాతీయ మానవ హక్కుల ఛైర్మన్ డాక్టర్ పలక సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో రెండేళ్ల పాటు ప్రోగ్రామ్ కార్యదర్శిగా తరుణ్‌తేజ పనిచేస్తారని పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలోని చీడికాడ రోడ్డులో ఐటిఐ వద్ద మంగళవారం విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై గేదె మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందికి ఉండడంతో మేతకు వెళ్లిన గేదెకు వైర్లు తగలడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.25వేలు విలువగల గేదె మృతి చెందడంతో రైతు మంకు అప్పారావు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సౌజన్యంతో, రైవాడ జలాశయం ఛైర్మన్ పోతల పాత్రునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 73 మంది కంటి రోగులను పరీక్షలు చేశారు. వారిలో 27 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలినవారికి కంటి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో గొర్లె గోవింద, తాడి చంటి, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ ఆర్.సురేష్, క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ గిరిజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కూలింగ్ వాటర్ పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ బలిజ మంగ మునలినాయుడు ఆర్థిక సహాయంతో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కూలింగ్ వాటర్ పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ప్రారంభించారు. పనులు జరిగినన్ని రోజులు కూలీలకు ప్రతి రోజూ 120 లీటర్లు కూలింగ్ వాటర్ అందించనున్నట్లు సర్పంచ్ మంగ తెలిపారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిని గంగాధరరావు, కోనేటి శివ గణేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన



ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని కింతాడ పంచాయతీ బొట్లవాని పాలెం, కింతాడ, బత్తివానిపాలెం, గొల్లల పాలెం పాఠశాలల్లో నూతనంగా నిర్మించిన ప్రహరీలను, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో కోటి 32 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ డార్మెటరీ అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ ఇన్చార్జి కన్నూరు సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి మాడుగుల నియోజకవర్గానికే రూ.10 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అర్హత గల ఉపాధ్యాయులతో మంచి బోధన అందిస్తుండగా ప్రైవేటు పాఠశాలల్లో చదవాల్సిన అవసరం ఏం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి కుమార్, టిడిపి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి ఏసుదాసు, పార్టీ నాయకులు రొంగలి మహేష్, దాడి ఎరుకునాయుడు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, బత్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు విధిగా ప్రోటోకాల్ పాటించాలని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరిగేటప్పుడు స్థానిక సర్పంచులకు, ఎంపిటిసీలు సమాచారం లేకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇకనుంచి ఏ ఒక్క ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినా తప్పనిసరి ప్రోటో కాల్ పాటించాలని అధికారులను ఆదేశించారు అసంత్రృప్తిగా మిగిలిపోయిన ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. గ్రామాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలను అధికారులు గుర్తించి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్యే బండారు సానుకూలంగా స్పందించి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి కుమార్, జడ్పిటిసి కర్రి సత్యం వైస్ ఎంపిపి గంగ భవాని, తహశీల్దారు పి.లక్ష్మీదేవి, ఎంపిడివో ఎంవి సువర్ణరాజ్, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపిటిసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరించిన దృశ్యం

ఉత్సవ కమిటీ సభ్యులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద కొలువైన శ్రీసీతారామ ఆలయంలో ఈనెల 6న జరిగిన సీతారామ కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిపిన 21 మంది ఉత్సవ కమిటీ సభ్యులను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత గౌరవ అధ్యక్షులు కొణతాల జగన్నాధరావు నాయుడు, అధ్యక్షులు కె.నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, సత్తివాడ దుర్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు తిమ్మపాత్రుని వెంకటేష్, కార్యదర్శి సిరసపల్లి రాజు, కోశాధికారి పాముల ప్రసాద్, ఆలయ కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : రజక వృత్తిదారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రాష్ట్ర రజక ఫెడరేషన్ అధ్యక్షులు జొన్నాడ మోహన్‌రావు అన్నారు. జిల్లా రజక సంఘం సమావేశం చోడవరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, వృత్తిదారులకు స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో దోబీ ఉద్యోగాల కేటాయించాలని, అర్హులైన వారికి మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలని, 50 ఏళ్లు దాటిన వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు, ఏపీ రజక కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణ, జిల్లా కార్యదర్శి కసింకోట జైనథ్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ వెంకట సత్యనారాయణ, జనసేన నాయకులు అల్లం రామప్పరావు, జి ములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టిడిపి సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : టిడిపి సంస్థాగత ఎన్నికలు ఈ నెల 23 నుండి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు వంటి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అనకాపల్లి, కశింకోట మండలాల టీడీపీ ముఖ్య నాయకులతో మంగళవారం ఆయన మాట్లాడారు. 23నుండి గ్రామ, బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాకర్స్ ట్రాక్ నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : శారదానది గట్టు నుండి ఎన్‌హెచ్ -16 బైపాస్ రోడ్ వరకు సుమారుగా 15 అడుగుల నది గట్టును బుల్డోజర్‌తో చదును చేయించి వాకర్స్ ట్రాక్ నిర్మాణం చేశారు. కల్యాణి నర్సింగ్ హెూమ్ అధినేత, టిడిపి నాయకులు డాక్టర్ కేకేవిఏ నారాయణ రావు సారథ్యంలో సుమారుగా రూ.25వేలు ఖర్చుతో దీనిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 40 మంది స్త్రీ, పురుష వాకర్స్ పాల్గొన్నారు. శిల్లా గోపాలరావు, విశ్రాంత పోలీస్ అధికారి, రాపేటి నారాయణ రావు, అనకాపల్లి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, డాక్టర్ డిడి నాయుడు, రోటరీ క్లబ్ ఎజి మురళీ కృష్ణ మాట్లాడారు. సిమ్మెంట్ రోడ్స్ మీద నడిస్తే ముడుకుల నొప్పులు వస్తాయని, మట్టి ట్రాక్ మీద నడిస్తే ముడుకులపై ఏ విధమైన ఒత్తిడి పడదని తెలిపారు. 'నడవండి, నడిపించండి - ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నినాదంతో అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. వాకర్స్ మళ్ల భాస్కరరావు, సీహెచ్ నరసింగరావు, కెవివి సత్యనారాయణ, ఆడారి మల్లిఖార్జునరావు, గంగరాజు, కె శ్రీనివాస్, ఆదికోటి సర్వారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నల్లమట్టిపాలెంలో ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, గొట్టివాడ నుండి పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు వారం, రెండు వారాలకి ఒకసారి మాత్రమే సరఫరా అవుతుందని, దీంతో తాగునీటి కోసం దళితులు అల్లాడుతున్నారన్నారు. కుళాయి కనెక్షన్ కూడా సక్రమంగా లేవని, ప్లాస్టిక్ వాటర్ పైపులు ద్వారా నీరు పట్టుకోవాల్సి దుస్థితి ఏర్పడిందని తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కులాయి కనెక్షన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం నల్లమట్టిపాలెంలో పైపు లైన్ వేయ లేదన్నారు. వారాలు, నెలలు తరబడి మంచి నీరు లేక దళితులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు స్పందించక పోవడం అత్యంత దారుణమని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మహిళలు, సిపిఎం నేతలు

రసాభాసగా మండల సమావేశం

జల జీవన్, ఉపాధి పనులు తదితర సమస్యలపై నిలదీసిన సభ్యులు



సమావేశంలో నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-కోటవురట్ల:పలు రకాల సమస్యలపై మండల సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమస్యలపై సభ్యులు చర్చించారు. ప్రధానంగా మండల వ్యాప్తంగా చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా ఉండడం పట్ల పలువురు సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో నాలుగు సంవత్సరాలుగా పనులు మొదలు పెట్టినా నేటికీ పనులు నత్తనడకనే సాగుతున్నాయని ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు తెలిపారు. ఉపాధి కూలీలకు పని కల్పించడంలో వివక్ష చూపుతున్నారంటూ నీలి గుంట సర్పంచ్ వరహాల బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా గ్రామంలో ఉపాధి పనులు జరగకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇన్చార్జి విఆర్‌పి రాజకీయం చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా గ్రామంలో నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించలేదని గ్రామంలో వంద మంది వరకు ఈనెల రేషన్ సరుకులు అందలేదని, సభ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన తహసిల్దార్ తిరుమల బాబు సిఎస్డిటిని వివరణ కోరారు. సరుకులు అందలేని మాట వాస్తవమేనని వచ్చే నెల సక్రమంగా సరుకులు అందే విధంగా చర్యలు చేపడతామని సిఎస్డిటి కుమార్ తెలిపారు. చౌడవాడ గ్రామంలో చెరువు అన్యాక్రాంతం అయ్యిందని పలుమార్లు అధికారులకు చెప్పిన తూతూ మంత్రంగానే చర్యలు చేపట్టారని గ్రామ సర్పంచ్ గోపాలకృష్ణ సభ దృష్టికి తీసుకు వెళ్ళగా, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు,

కైలాసపట్నం బాణాసంచా ప్రమాదం వంటివి పునరావృతం కాకుండా బాణసంచా కేంద్రాల్లో ప్రమాదాల నివారణకు ముందస్తుగా చర్యలు చేపట్టాలని జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి సూచించారు. తహశీల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ, ఇటీవల కైలాస పట్నం గ్రామంలో బాణాసంచా పేల్లులలో మృతి చెందిన పదిమందికి గాను ఎనిమిది మందికి 15 లక్షలు చొప్పున అందజేశామన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1.50 లక్షల చొప్పున అందజేస్తామని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడీ కేంద్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలను పట్టించుకోలేదని అదేవిధంగా అధికారులు కూడా మండలాన్ని సందర్శించిన సందర్భాల పట్ల పలువురు ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టి కి తీసుకువచ్చారు. మండల కేంద్రంలో ఆర్ అండ్ బికి స్థలాలను ఆక్రమించుకుంటున్నారని, అయినా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల జడ్పిటిసి సభ్యురాలు సహా పలువురు సభ్యులు సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు గ్రామ సర్పంచులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హెచ్ఎంకు ఘన సన్మానం

ప్రజాశక్తి-చీడికాడ:ఏ వృత్తిలో అయినా సేవా దృక్పథంతో పనిచేస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని అర్జునగిరి గ్రామంలో మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఈనెల 30న పదవీ విరమణ పొందుతున్న లెక్కల ప్రసాద్ రావు మాస్టారికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సభలో రఘువర్మ మాట్లాడుతూ, సమాజంలోనే ప్రత్యేక గుర్తింపు స్థానం ఒక ఉపాధ్యాయునికి మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు, మండల అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి వరాహమూర్తి పాల్గొన్నారు.

పెదపేటలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదపేట గ్రామంలో మంగళవారం మలేరియా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బెన్నయ్య మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని, ఈ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ తెరలను ఖచ్చితంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కె.రమాకాంతరావు, ఏఎన్ఎం, అంగన్వాడీలు పాల్గొన్నారు.



స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఎలక్ట్రానిక్స్ అభ్యసించిన విద్యార్థులకు 12 రోజులు ఇంటర్న్షిప్ పూర్తి చేసినందుకు మంగళవారం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. వృత్తి విద్య కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు యం.సాయి చందు, పి.విష్ణు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం. కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి పాడేరు గ్రామానికి చెందిన నవర బబ్బులు, బంగారం షాప్ యజమాని అమ్మవారి ఆలయ అభివృద్ధికి సుమారు 10 వేలు రూపాయల మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావుకి అందించారు.ఈ కార్యక్రమంలో ఎన్నం శెట్టి వెంకట్రావు, దాసరి రాజు, కన్నారావు, గెంజి రాజేష్ కుమార్,మాజీ కో-ఆపరేటివ్ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, పాము సత్తిబాబు, ముమ్మిన రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న దాతలు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



కొత్తకోటలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పెంటపాటి సూర్యారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పేర్కొన్నారు. అనంతరం కొత్తకోట పరిసర గ్రామాలైన కన్నంపేట కాలనీ, కన్నంపేట, మర్రివలస, వమ్మవరం గ్రామాలలో ఉపాధ్యాయులు పర్యటించారు. చెరువు పనులలో నిమగ్నమైన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు అప్పటికప్పుడు పలువురు విద్యార్థులను చేర్పించారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ పాఠశాల ఉపాధ్యాయులు కశింకోట గ్రామంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో జాన్ చేయాలని మంగళవారం ప్రచారం చేశారు. మండలంలోని తేగాడ, సత్తమ్మ కాలనీ, కొత్తూరు, తమ్మయ్యపేట గ్రామాల్లో ప్రాధనోపాధ్యాయులు ఎంఆర్‌వి. అప్పారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటిఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. తల్లి దండ్రుల సమక్షంలో విద్యార్థుల నుండి అంగీకార పత్రాలు తీసుకున్నారు. ప్రభుత్వం కలిపిస్తున్న పథకాలు, నాణ్యమైన విద్యా, క్రీడాలలో శిక్షణ మొదలైన విషయాలపై అవగహన కలిపించారు.

బుచ్చయ్యపేట : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని దిబ్బిడి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, గ్రామ పెద్దలు బంటు వారి చెరువు వద్ద జరుగుతున్న ఉపాది హామీ పనుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్యాభోధన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని వివరించారు. గ్రామ సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఏంపీటీసీ గొంపా చినబాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మండపాక శివ, మాజీ ఎంపిటిసి గొన్నాబత్తుల శ్రీనివాసరావు, సేనాపతి శ్రీనివాసరావు, పెడిరెడ్ల రాజు, సేనాపతి మణికంఠ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేట మండలం దిబ్బిడిలో మాట్లాడుతున్న టీచర్లు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


కవగుంటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- రావికమతం:ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. మండలంలో కవగుంట గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నెలకు ఒక మారు గ్రామంలో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరానికి 65 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకొని, ఉచితంగా మందులు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రోబ్బా వర కుమారి, మాజీ వార్డ్ మెంబర్లు సిద్ధ దేవుడమ్మ, నడిపల్లి కాంతమ్మ, ఆశ రాము, నూకరత్నం, పచ్చికూర రాము పాల్గొన్నారు

సెలవుల్లో ఊరు వెళితే సమాచారం ఇవ్వండి

-నర్సీపట్నం టౌన్ సిఐ గోవిందరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సెలవుల్లో ఊరు వెళితే తమకు సమాచారం ఇవ్వాలని నర్సీపట్నం టౌన్ సీఐ జీ.గోవిందరావు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు నర్సీపట్నంలో ఎవరైనా ఇల్లు వదిలి కొన్ని రోజులు బయటకు వెళ్లాల్సి వస్తే 112కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, లేదా నేరుగా సమాచారం ఇస్తే ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలను మీ ఇంటికి అమర్చడం జరుగుతుందని తెలిపారు.



ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి



నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు, కూలీలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆకలి కేకలతో కూలీలు అలమటిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెంలో మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నెలల తరబడి కూలీలకు పేమెంట్లు చెల్లించకపోతే ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. శాసనసభ్యులకు, ఎంపిలకు, జిల్లా అధికార యంత్రాంగానికి నెలల తరబడి జీతాలు రాకపోతే పని చేస్తారా అని ప్రశ్నించారు. కూలి డబ్బుల కోసం ఇంకెంతకాలం ఎదురుచూడాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కూలీలకు బకాయి పేమెంట్లు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, కొల్లి చిట్టిబ్బాయి, గొర్ల లక్ష్మి, కాళ్ళ మంగమ్మ, లక్ష్మి, రాధా, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆనందపురం : ఫిబ్రవరి నుంచి బకాయి పడ్డ ఉపాధి కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు, భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కుసలవాడ పంచాయతీ రేగానిగూడెం గ్రామంలో చెరువులో ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి నెల నుండి ఉపాధికూలీ డబ్బులు అందలేదని, ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనిచేస్తున్నా రూ.70 నుంచి రూ.100 లోపు మాత్రమే కూలీ డబ్బులు పడుతున్నాయని, పనిప్రదేశంలో సౌకర్యాలు లేవని కూలీలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని లోపాలను సరిచేసి కూలీలకు సరిపడా వేతనం వచ్చేలా చూడాలని, రోజుకు రూ.700వేతనం, ఏటా 200 పనిదినాలు, పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, ఇతర సౌకార్యలను కల్పించాలని కోరారు. ఐద్వా నేత కె.నాగరాణి మాట్లాడుతూ, సంక్షేమబోర్డు ఏర్పాటుచేసి, ఉపాధి కూలీల కుటుంబాలకు వడ్డీలేని రుణాలు, అందరికీ జాబ్‌కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, పెంటారావు, లక్ష్మణరావు, లక్ష్మి, సన్యాసమ్మ, రత్నం, 150మంది కూలీలు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు, స్థానికులు

స్మార్ట్ మీటర్లు మా కొద్దు

ప్రజాశక్తి- మాడుగుల: మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన బస్సు స్టాండ్ వద్ద స్మార్ట్ కరెంట్ మీటర్ వద్దు పాత మీటర్లే ముద్దు అంటూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇరట .నరసింహమూర్తి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని పెడితే పగలగొట్టండి అని ప్రతిపక్షంలో ఉండగా లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. కరెంటు బిల్లులో స్మార్ట్ మీటర్లకు 15 వేల రూపాయలు వాయిదాలు పద్ధతిలో వసూలు చేస్తారని, ఈ ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై. భారం వేయడం దుర్మార్గమన్నారు. పార్టీలక తీతంగా రాష్ట్ర ప్రజలు ప్రభుత్వాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు ఆపాలని, పెంచిన చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రీ నాగరాజు, గాలి కిరణ్ కుమార్, షేక్ చాందిని, మహేష్, ప్రజలు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న నాగజ్యోతి

నాగజ్యోతికి జాతీయ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు పివిఎం. నాగజ్యోతి మరో ఘనత సాధించింది. తన వైవిధ్యభరిత మైన బోధనతో ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశిష్ట పాత్ర పోషించడం పై ఆమె కృషికి గుర్తింపుగా ప్రగ్యాన్ స్కోర్ మోర్ ఫౌండేషన్ వారు సోమవారం పొట్టి శ్రీ రాములు తెలుగు యూనివర్సిటీ లో సురవరం ప్రతాప్ రెడ్డి హాల్‌లో ఆమెకు ప్రైడ్ ఆఫ్ ఇండియా 2025 జాతీయ అవార్డును ప్రదానం చేశారు. ఆంగ్ల భాషాబోధనలో ఆమె అభ్యాసకులకు మౌలిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా, నైపుణ్యపూరితమైన మెలకువలు, ఉచిత ప్రయోగం, శబ్దాచ్చారణ, పఠన నైపుణ్యం, రచనా నైపుణ్యం, భావ ప్రకటన వంటి అంశాలను సరళమైన, వినూత్నమైన పద్ధతుల్లో నేర్పిస్తున్నారు. .ఆమె రూపొందించిన క్రియాశీలక బోధనా పద్ధతులు, వర్క్షాపులు, కథనాల ద్వారా నేర్పే విధానాలు విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడమే కాకుండా, నిజ జీవితానికి అవసరమైన భాషా నైపుణ్యాలను అలవాటు పరుస్తున్నారు. వివిధ బోధనాభ్యాస పరికరాల వినియోగంతో ఆమె నిర్వహించే కృత్యా ధారణ బోధన పద్ధతులు భాషా అభ్యాసాన్ని మరింత చైతన్యవంతంగా, ఆసక్తిదాయకంగా మార్చుతున్నాయి.

320 వాహనాలు అందజేత

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటార్ వాహనాలను విశాఖ సిటీ పోలీసులు సంబందిత వాహన యజమానులకు 'వాహన మేళా' ద్వారా మంగళవారం అందజేశారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ, వివిధ కేసుల్లో వివిధ సందర్భాలలో వాహనాలను పోలీసులు సీజ్ చేసిన అనంతరం వివిధ కారణాలతో యజమానులు రిలీజ్ చేసుకోలేక అవి నిరుపయోగంగా మారుతున్నందున ఈ మేళా ద్వారా ప్రజలకు అందజేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 19 న మొదటి వాహన మేళాను నిర్వహించి 152 వాహనాలను సంబందిత యజమానులకు అప్పగించామని తెలిపారు. రెండవ మేళా ద్వారా 320 వాహనాలను సంబంధిత యజమానులకు అందజేసినట్లు వివరించారు.

దళితులపై దాడులను అరికట్టాలి

రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పాపారావు



మాట్లాడుతున్న పాపారావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16న పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళిత యువకుడైన పల్లపు సురేష్ అగ్ర కులస్తుల ఇంట్లో ఎలక్ట్రికల్ వర్క్ చేస్తూ చనిపోతే ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అడిగిన పాపానికి అక్కడ అదే గ్రామంలో ఉన్న అగ్రకులస్తులు దళితులను గ్రామం నుండి సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోనే ఇంత దారుణం జరగడం అన్యాయమన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం స్పందించి తక్షణమే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడికి విచారణకు ఆదేశించి తక్షణమే అరెస్టు చేసి దళిత బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పెద్దాడ లోవరాజు మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బహిష్కరణ గురిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. రెల్లి మహిళ హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్షురాలు యర్రంశెట్టి వరలక్ష్మి మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీలకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలు చేయడంలో విఫలమవు తున్నారన్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తే ప్రతిఘటన

ప్రజాశక్తి-ఉక్కునగరం: ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తే ప్రతిఘటన తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1531వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో రోలింగ్ మిల్స్ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేసే హక్కు కేంద్రానికి లేదన్నారు. పోరాట కమిటీ మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కుటిల ప్రయత్నాలను ముమ్మరం చేసిందని, ఈ ప్రయత్నాలను పోరాటాల ద్వారా అడ్డుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఎ.మసేన్‌రావు, డి.దేముడు, జి.ఆనంద్, వర్మ, డి.రమేష్, రాజేశ్వరరావు, కె.రాంబాబు, జి.రమేష్, అమ్మోరు, అప్పలరాజు, బోండా మహేష్, కార్మిక నాయకులు దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ శాఖ కమిటీలు త్వరలో వేస్తాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏసుదాస్



మాట్లాడుతున్న ఏసుదాస్

ప్రజాశక్తి- మాడుగుల: గ్రామ శాఖ కమిటీలు ఏకగ్రీవంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ అబ్జర్వర్ వాసిరెడ్డి ఏసుదాస్ అన్నారు. మంగళవారం మాడుగుల వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ నాలుగు మండలాల్లో సిక్స్ మ్యాన్ కమిటీ మండలాల వారిగా గ్రామ శాఖ ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ దిశగా ప్రతి మండలంలో పర్యటించి ఆయా గ్రామాల్లో పనితీరును చక్కబెట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలు మహానాడు జరిగే సమయానికి పూర్తి చేస్తామన్నారు. సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే అన్ని పథకాలు అమలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల కార్యదర్శి ఉండూరు దేవుడు, పుప్పాల రమేష్, కేజే పురం ఎంపీటీసీ బీసెట్టి శ్రీనివాసరావు, అలమండ సూర్యారావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆట-పాట



గీతాలను ఆలపిస్తున్న సీనియర్ సిటిజన్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా కన్సరన్ ఛారిటబుల్ ట్రస్ట్, విశాఖ బాలోత్సవ్ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన మీట్-గ్రీట్-ట్రీట్ (ఎంజిటి) కార్యక్రమం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్ హాజరై మాట్లాడుతూ, డాక్టర్ పికె.జోష్ నేతృత్వంలో నిర్వహించబడుతున్న ఎంజిటి అనేక రకాలుగా సీనియర్ సిటిజన్లను మైమరపిస్తోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కన్సరన్ ఛారిటబుల్ ట్రస్ట్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పికె.జోష్ మాట్లాడుతూ, ఎంజిటి వయోవద్ధులతో పాటు విభిన్న ప్రతిభావంతులకు అతిత్వరలో ఒక ఎంజిటి కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. సభ్యులందరూ సహకరిస్తే వయోవృద్ధుల కోసం సొంత భవనాన్ని నిర్మించాలనుకుంటున్నామని, భావి వయోవృద్ధులకు ఈ కేంద్రం ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. విశాఖ బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్, ఎంజిటి కో-కన్వీనర్ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, కన్సరన్ సంస్థ ద్వారా డాక్టర్ పి.కె.జోష్ విశేషమైన సేవలను అందజేస్తున్నారని, వారి నిస్వార్థ సేవకు మద్దతుగా తమ సంస్థ కూడా కలిసి పనిచేస్తోందని తెలిపారు. సహ కన్వీనర్, విశాఖ సమాచారమ్ ప్రధాన సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు మాట్లాడుతూ, వయోవద్ధులకు శాశ్వత చిరునామా కోసం ప్రయత్నాలు ప్రారంభించామని తెలిపారు. ఎవరైనా తమకు అవసరం లేని ప్రాంగణాలను, ప్రదేశాలను ఈ కార్యక్రమానికి మద్దతుగా అందించవచ్చని చెప్పారు. అనంతరం రమాప్రభ బృందం నిర్వహణలో అనేక వినోద కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీ డెంటల్, వీ హెల్త్ కేర్ అధినేత డాక్టర్ రమేష్ దంత నిర్వహణలో మెళకువలను తెలియజేశారు. డాక్టర్ మంజువాడ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, కృషి ఆర్థోపెడిక్ ట్రస్ట్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. హారిజన్ వైద్య కేంద్ర నిర్వాహకులు డాక్టర్ జ్యోత్స్న తేజ సాధారణ జీవన విధానంలో కొన్ని మెళకువలు నేర్పించారు. ఉత్సర్స్ బ్యాంక్ ప్రతినిధులు తమ పథకాలను వివరించారు.

విశాఖ పోర్టులో నేపాల్ బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ పశుసంవర్ధక శాఖ కార్యదర్శి డాక్టర్ గోవింద్ ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన నేపాల్ ప్రతినిధి బృందం మంగళవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించినట్లు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. నేపాల్ బృందానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులోని మౌలిక సదుపాయాలు, నిర్వహణా సామర్థ్యం, కీలక వసతులపై పోర్టు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందించారు. గ్లోబల్ టెండర్ల ద్వారా యూరియా, డిఎపి వంటి ఇతర ఎరువుల దిగుమతి అవకాశాలను అన్వేషించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఇండో-నేపాల్ ఎరువుల సరకు ఒప్పందం (ట్రీటీ)లో భాగంగా, ప్రస్తుతం కోల్‌కతా పోర్టులో అమలు అవుతున్న విధంగా, విశాఖపట్నం పోర్టు ద్వారా కూడా బల్క్ రవాణాకు అనుమతి కల్పించే ప్రతిపాదనపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా కనీసం రెండు లక్షల టన్నుల అదనపు ఎరువుల సరుకు రవాణా సాధ్యమవుతుందని అంచనా వేశారు. విశాఖపట్నం పోర్టుకు వాణిజ్య పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని నేపాల్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో క్రిషి సమగ్రి కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సాల్ట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ సిఇఒ పాల్గొన్నారు.